క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికే 'స్పందన'



గుడివాడటౌన్: ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆర్డీఓ పి.పద్మావతి తెలిపారు. సమస్యలపై ఫిర్యాదు చేసిన ప్రతి ఒక్కరికీ రశీదు ఇస్తున్నామని, సమస్య తీవ్రతను బట్టి దాని పరిష్కారానికి నెల రోజులలోపు సమయం పడుతుందన్నారు. నెల రోజులలోగా లబ్ధిదారుని సమస్య పరిష్కారం లేదా పరిష్కారానికి మార్గం తెలియజేస్తామన్నారు. సోమవారం నిర్వహించిన స్పందనలో రెండు అర్జీలు అందాయని, వాటిని సంబంధిత అధికారులకు పంపామని చెప్పారు.

నేడు డయల్ యువర్ డీఎం

గుడివాడటౌన్: ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలను వివరించేందుకు ఆర్టీసీ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జి.రాజేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 నుంచి 12.30 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆర్టీసీ ప్రయాణికులు 99592 25464 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు, సమస్యలు తెలియజేయాలని ఆయన కోరారు.

వైభవంగా లక్ష్మీనృసింహుని గరుడోత్సవం



కైకలూరు: రాష్ట్రంలో 50వ దర్మక్షేత్రంగా విరాజిల్లుతోన్న వరహపట్నం భూ సమేత లక్ష్మీనృసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు గరుడ వాహనంపై వీధుల్లో సోమవారం ఊరేగారు. ఉదయం స్వామికి సహస్రనామార్చన, నిత్య హోమం, గ్రామ బలి హరణ, కల్పవృక్ష వాహన సేవ, అష్టోత్తర శత నామ పూజ చేశారు. మంగళవారం స్వామి వారికి చందనోత్సవం, నృసింహ యాగం నిర్వహిస్తామని ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు కలిదిండి మండల పరిషత్ సమావేశం

కైకలూరు(కలిదిండి): కలిదిండి మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సీతారాం కుమార్ తెలిపారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగే సమావేశంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నీటి సరఫరా, విద్య, ఇరిగేషన్, డ్రైయినేజీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయం, మత్స్యశాఖ, గృహనిర్మాణం, వైద్యం, విద్యుత్ శాఖలపై సమీక్ష జరుగుతుందన్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం వరకు గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమం, బీసీ సంక్షేమం, ఆర్టీసీ, పోలీసు, వెలుగు, సాంఘిక సంక్షేమం, పశుసంవర్ధక, గ్రామీణ ఉపాధి హామీ, రోడ్లు, భవనాలు, సెబ్ శాఖలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

ఆదర్శనీయుడు అయ్యంకి వెంకట రమణయ్య



అయ్యంకి(మొవ్వ): గ్రంథాలయ సృష్టికర్త అయ్యంకి వెంకటరమణయ్య ఆదర్శనీయుడని వక్తలు కొనియాడారు. అయ్యంకి వెంకట రమణయ్య స్వగ్రామమైన మొవ్వ మండలం అయ్యంకి గ్రామంలో ఆయన 44వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన మనువడు మురళీకృష్ణ పాల్గొని గ్రామంలోని పాఠశాల విద్యార్థులకు విద్యోపకరణాలు పంపిణీ చేశారు. పాఠశాలలో నిర్వహించిన ఆటల పోటీల్లో గెలిపొందిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, పీసీ కమిటీ చైర్మన్ శ్రీనివాసరావు, హెచ్‌ఎం ఓ.నాంచారమ్మ, సీఆర్పీ ఆంజనేయులు పాల్గొని వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అల్లూరులో అన్నసమారాధన

ముదినేపల్లిరూరల్: మండలంలోని అల్లూరు నాంచారమ్మ ఆలయం వద్ద సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన 1,500 మంది భక్తులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం అమ్మవారి సంబరం నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించారు.

జగనన్న గ్రీన్ విలేజ్ రోల్ మోడల్‌గా నిలవాలి

- ఎమ్మెల్యే డీఎన్నార్
- లబ్ధిదారులకు కేడీసీసీ బ్యాంకు రూ.2 లక్షలు రుణం మంజూరు



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు: జిల్లాలో కైకలూరు జగనన్న గ్రీన్ విలేజ్‌ను రోల్ మోడల్‌గా నిలపాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ఏలూరు రోడ్డు గ్రీన్ విలేజ్‌లో లబ్ధిదారులు, అధికారులు, కాంట్రాక్టర్‌తో సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం కోసం పునాదుల వరకు వేసుకుని ఆగిన లబ్ధిదారులు ప్రభుత్వ సాయాన్ని అందిపుచ్చుకుని ఇళ్ల నిర్మాణాలు తిరిగి కొనసాగించాలని చెప్పారు. బేస్‌మెంట్ లెవెల్ వరకు వేసుకుని ఆర్థికస్తోమత లేక మధ్యలో ఆగిపోయిన 500 మంది లబ్ధిదారులకు ఆర్త హోమ్స్ నిర్మాణ భాగస్వామ్యంతో అతితక్కువ ఖర్చుతో ఇళ్లు నిర్మించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు.

ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు అందిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. కేడీసీసీ బ్యాంకు నుంచి ఒక్కో లబ్ధిదారునికి రూ.2 లక్షలు రుణం మంజూరు చేయిస్తున్నామన్నారు. ఆర్త హోమ్స్ నూతన టెక్నాలజీతో తక్కువ ధరకే నిర్మాణాలు పూర్తి చేస్తారని, లబ్ధిదారులంతా వారితో ఒప్పందం చేసుకుని ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడివి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ఎంపీటీసీ సభ్యులు మంగినేని రామకృష్ణ, హౌసింగ్ డీఈఈ రమణ మూర్తి, తహసీల్దార్ మురళీకృష్ణ, ఏఈ శేఖర్, ఆర్త హోమ్స్ ఎండీ పి.నారాయణరెడ్డి, నాయకులు తోట మహేష్, మూడెడ్ల గౌరి నాయుడు, నాగిరెడ్డి రమేష్, జంగా మోహన్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్స్, పంచాయతీ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్, ఎంపీడీఓ సీతామహాలక్ష్మి

గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

పెదపారుపూడి: ప్రభుత్వం నిర్మిస్తున్న జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ నిర్మాణ పనుల వేగవంతంపై మండల అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేకాధికారి గ్రామాల వారీగా జగనన్న కాలనీల్లో ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లు నిర్మాణ పనులు పూర్తి చేశారు, ప్రసుత్తం ఇళ్లు ఏఏ దశలో ఉన్నాయో జగనన్న లే అవుట్ల ప్రత్యేకాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉగాది నాటికి ఇళ్లు పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. మండలంలో బేసిమెంట్ దశలో ఎక్కువగా ఇళ్లు ఉన్నాయని చెప్పారు. అధికారులు ఇళ్ల నిర్మాణ పనులపై ప్రత్యేక దృష్టి సారించి పనులు పూర్తి చేయాలన్నారు. ఇళ్లు పూర్తి చేస్తే ప్రభుత్వం నుంచే ఆర్థిక సాయం వెంటనే వచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.సీతామహాలక్ష్మి, ఈఓపీఆర్డీ ఎం.నాగిరెడ్డి, హౌసింగ్ ఏఈ మల్లికార్జునరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవాలు



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలో నాట్యాచార్యుల ఇలవేల్పు అయిన శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ రామలింగేశ్వర సామి వార్ల 260వ కల్యాణోత్సవాన్ని ఆదివారం రాత్రి 11 గంటలకు కనులపండువగా నిర్వహించారు. పూర్ణ దీక్షాపరులు రాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి బ్రహ్మత్వంలో కొనసాగుతున్న ఈ వేడుకలో పురోహితులు జోశ్యుల హనుమత్ కృష్ణ ప్రసాద్, అర్చకులు పెనుమూడి బాబురావు, పూర్ణచంద్రశేఖర శర్మ, సతీష్ కుమార శర్మ, నరేంద్ర శర్మలు పాల్గొని కల్యాణ వేడుకను చేపట్టారు. అనంతరం నంది వాహనంపై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. సోమవారం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

అమృతేశ్వరస్వామి ఆలయంలో..

ముదినేపల్లిరూరల్: మండలంలోని సింగరాయపాలెం అమృతేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అర్చకుడు రుద్రపాక ప్రసాద్ ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ విగ్రహాలను వేదికపై ఉంచి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు హాజరై కల్యాణాన్ని కనులారా వీక్షించారు. ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు చైర్మన్ కంతేటి వరలక్ష్మి, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

ప్రకృతి వ్యవసాయంతో భవిష్యత్‌కు మేలు

జమీగొల్వేపల్లి(పామర్రు): ప్రకృతి వ్యవసాయంతో భవిష్యత్‌లో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అరుణ తెలిపారు. కొమరవోలు యూనిట్‌లోని జమీగొల్వేపల్లి గ్రామంలో సోమవారం నవధాన్యాల సాగుపై సోమవారం అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. 32 రకాల పచ్చిరొట్ట విత్తనాలను ప్రదర్శించామన్నారు. వీటిని సాగు చేయటం వలన నేల సారవంతమవుతుందని చెప్పారు. ప్రస్తుతం వేసవిలో ఈ సాగు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు, స్థానిక పాఠశాల విద్యార్థులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



జమీగొల్వేపల్లిలో అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పామర్రు(పమిడిముక్కల): రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని పాటించాలని ప్రకృతి వ్యవసాయం అధికారులు నిర్మల, పావని సూచించారు. ప్రకృతి వ్యవసాయంతో కలిగే ప్రయోజనాలకు పమిడిముక్కలలో వివరించారు. కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడివాడలో వరల్డ్ డెంటిస్ట్ డే

గుడివాడటౌన్: ప్రపంచ దంత వైద్యుల దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ దంత వైద్యుడు లింగంనేని నాగేంద్రనాథ్, డాక్టర్ మలిరెడ్డి రవిలను సత్కరించారు. దంత సంరక్షణలో వీరు చేస్తున్న సేవను క్లబ్ సభ్యులు కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అర్జా ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు పర్వతనేని చంద్రశేఖర్, మాజీ గవర్నర్ బొగ్గారపు తిరుపతయ్య, మెరుగుమాల శివరామకృష్ణ, కార్యదర్శి వంగపండు బ్రహ్మాజీ, కోశాధికారి చింత రామకృష్ణ, జె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

తారకరామ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

గుడివాడ తారకరామ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కిన్నెర కాంప్లెక్స్‌లోని విశ్వదంత వైద్యశాల డాక్టర్ కళ్యాణ చక్రవర్తిని క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ మహ్మద్ అలీ, పూర్వ అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, కొల్లిపర సాయి సుబ్రహ్మణ్యం, చిన్నం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ నాగేంద్రనాథ్‌ను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

ప్రాకర్ల(పామర్రు): మండల పరిధిలోని ప్రాకర్ల గ్రామంలో గల మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల 70వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ పి.విజయలక్ష్మి పాల్గొని మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రుల సహకారంతో వార్షికోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి.రామలింగేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. హెచ్‌ఎం రాయన శివరామ ప్రసాద్, ఉపాధ్యాయులు కె.జగదీష్, విజయ్‌కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, సీఆర్పీ ప్రశాంతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ విజయలక్ష్మి

కేంద్రం ప్రజావ్యతిరేక విధానాలు వీడాలి

తోట్లవల్లూరు: కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను వీడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రఘు కోరారు. స్థానిక మెయిన్ సెంటర్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో రఘు మాట్లాడుతూ.. కేంద్ర విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక కర్షక పోరాట ప్రదర్శనలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ప్రదర్శన విజయవంతానికి పిలుపు

కేంద్ర విధానాలతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్మిక, కర్షక, రైతులకు సంబంధించిన పలు సమస్యలపై ఢిల్లీ వేదికగా నిరసన ప్రదర్శన చేస్తున్నామని చెప్పారు. ఈ నిరసన ప్రదర్శనలో అన్నివర్గాల ప్రజలు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కె.శివనాగేంద్రం, నాయకులు శీలం ప్రకాశరావు, వీరంకి శ్రీనివాసరావు, అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో మాట్లాడుతున్న రఘు

లయన్స్ మల్టీ సర్వీస్ సెంటర్ కూల్చివేత ఆపాలని వినతి

గుడివాడటౌన్: ఎంతో కాలంగా పేదలకు కంటి వైద్యాన్ని అందిస్తున్న లయన్స్‌క్లబ్ మల్టీ సర్వీస్ సెంటర్ తొలగింపును నిలుపుదల చేయాలని లయన్స్ క్లబ్ సభ్యులు కోరారు. ఆర్డీఓ పద్మావతికి ఆమె కార్యాలయంలో ఈ మేరకు సోమవారం వినతి పత్రం అందజేశారు. టిడ్కో ఇళ్లకు సీఆర్‌డీఏ నిబంధనల ప్రకారం రహదారి ఏర్పాటు చేయడం వల్ల కోటి రూపాయలు విలువచేసే మల్టీ సర్వీస్ సెంటర్ పూర్తిగా నేలమట్టం అవుతుందన్నారు. ఎన్నో వేల మందికి కంటిచూపును అందిస్తూ దంత వైద్యాన్ని కూడా ఉచితంగా అందజేస్తున్న ఈ భవనాన్ని తొలగించకుండా ప్రత్యామ్నాయం ఆలోచించాలని వారు కోరారు. గత 17 ఏళ్లుగా ఈ సేవలు అందిస్తున్నామని ఇది కేవలం సేవాకేంద్రం తప్ప వ్యాపారం కాదన్నారు. భవిష్యత్‌లో టిడ్కో ఇళ్లలో నివసించే పేదలకు సైతం ఉచిత వైద్యం అందిచాలని తాము సంకల్పంతో ఉన్నామన్నారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ పి.పద్మావతి మాట్లాడుతూ సీఆర్డీఏ కార్యాలయం నుంచి వచ్చిన ఉత్తర్వులపై తాను ఏ నిర్ణయం తీసుకోలేనన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లాలని ఆమె సూచించారు. లయన్స్‌క్లబ్ ప్రముఖులు సోమూరి వెంకట్రావు, వల్లూరుపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎన్.శివశంకర్, పిన్నమనేని సాంబశివరావు పాల్గొన్నారు.



ఆర్డీఓ పద్మావతితో చర్చిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కుటుంబ విలువలు పాటించండి

కైకలూరు: ప్రతి ఒక్కరూ కుటుంబ విలువలు పాటించి ఆదర్శ జీవితం గడపాలని సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జి.షణ్ముఖరావు సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక చిన చెరువు గట్టు నాగేంద్రస్వామి ఆలయ ఆవరణలో మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో న్యాయ అక్షరాస్యత శిబిరం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. సృష్టిలో మహిళలకు ఎంతో విలువ ఉందన్నారు. నేడు అన్ని రంగాల్లో మహిళలు ముందుకు వెళుతున్నారని, చట్టాలపై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి.షణ్ముఖరావు, న్యాయవాదులు పి.పవన్ కాంత్, కందుల రమా పార్వతి పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మండవల్లి: ఇండియన్ బ్యాంక్ గృహ, వాహన, బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీరేటుకే అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని విజయవాడ డెప్యూటీ జోనల్ మేనేజర్ బిస్వనాథ్ దాస్ కోరారు. మండవల్లి ఇండియన్ బ్యాంక్ శాఖ రికార్డులను సోమవారం ఆయన తనిఖీ చేసి, బ్యాంకు సేవలపై వినియోదారులను అడిగి తెలుసుకున్నారు. మండవల్లి మండలం ఆక్వా రంగానికి జోనల్ పరిధిలో రూ.40 కోట్ల రుణాలు అందించడానికి బ్యాంకు సిద్ధంగా ఉందన్నారు. డ్వాక్రా సంఘాలకు గరిష్ఠంగా రూ.20 లక్షలు రుణం, అదే విధంగా రూ.3 లక్షల వ్యక్తిగత రుణం బ్యాంకు వద్దకు రాకుండానే మంజూరు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే లింగ సమానత్వం



ప్రసంగిస్తున్న శ్రీలక్ష్మి

గుడివాడటౌన్: ఆడపిల్లలు ఉన్నత విద్యనభ్యసించి తత్సమానమైన ఉపాధిని పొందినప్పుడే లింగసమానత్వాన్ని పొందగలుగుతారని గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కె.శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల మహిళాభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో లింగ సమానత్వ సాధన అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు విద్యలో వెనుకబాటుతనమే పురుషుల ఆధిపత్యానికి కారణమవుతుందన్నారు. నాణ్యమైన విద్యను అభ్యసించడం వలన ఉన్నత స్థితికి చేరగలుగుతామని తద్వారా లింగ సమానత్వాన్ని సాధించ గలుగుతామన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కేఎస్.అప్పారావు, ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, కో–ఆర్డినేటర్ బీఎస్‌ఎస్ పద్మజ, అధ్యాపకులు సుశీల, పి.శ్రీదేవి, టి.వీణ, ఏ.గ్రీష్మ, డి.విమల కుమారి, జి.గీత పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

- కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్
- పెదలంకలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం


కైకలూరు(కలిదిండి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) తెలిపారు. కలిదిండి మండలం పెదలంక సచివాలయ పరిధి పల్లిపాలెంలో 183వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామంలో చర్చి, ఆలయాల్లో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఇంటింటికీ వెళ్లి మూడేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధి పొందిన కుటుంబాలకు కరపత్రాలను పంపిణీ చేశారు.

సమన్వయంతో అభివృద్ధి..

ఈ సందర్భంగా పల్లెపాలెం ప్రజలు తాగునీటి పైపులు, విద్యుత్ స్తంభాలు, అంతర్గత రహదారులను నిర్మించాలని కోరారు. గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామాల్లో అపరిష్కృత సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అభివృద్ధి సాధించాలని సూచించారు. అర్హత ఉండి పథకాలు పొందిన వారు, తిరిగి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పథకాలు మంజూరు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, ఏఎంసీ చైర్మన్ బినాల బ్రహ్మాజీరావు, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, వైస్ ఎంపీపీ కట్టా నాగలక్ష్మి, గ్రామ సర్పంచ్ మోకా లక్ష్మి, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు గద్దె ఆనంద్ కుమార్, ఎంపీటీసీ సభ్యుడు రావడి బాలాజీ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షుడు, ఎస్‌ఐ ఎ.మణికుమార్, విద్యుత్‌శాఖ ఏఈ మల్లికార్జున, పంచాయతీ కార్యదర్శి నాగబాబు, వీఆర్వో సుబ్రహ్మణ్యం, గ్రామ సచివాలయ కన్వీనర్లు, సహాయకులు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు బొమ్మినంపాడులో..

ముదినేపల్లిరూరల్: మండలంలోని బొమ్మినంపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తామని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే డీఎన్నార్ కార్యక్రమంలో పాల్గొని స్థానిక సమస్యలపై ప్రజలతో మాట్లాడడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.



పల్లెపాలెంలో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

లారీని ఢీ కొనడంతో డ్రైవర్‌కు గాయాలు

తోట్లవల్లూరు: కరకట్టపై నిలిచి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీ కొనడంతో డ్రైవర్ గాయపడిన సంఘటన మండలంలోని భద్రిరాజుపాలెం వద్ద జరిగింది. వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం నుంచి ఫ్లైయాష్ లోడుతో కృష్ణా కరకట్టపై సోమవారం తెల్లవారుజామున అవనిగడ్డ వెళుతున్న లారీ భద్రిరాజుపాలెం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ ముందు భాగం దెబ్బతినటంతో పాటు డ్రైవర్ కె.రాజకుమార్ గాయపడ్డాడు. ప్రమాద ప్రాంతాన్ని పోలీసులు సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కైకలూరు(కలిదిండి): వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అధికారులను ఆదేశించారు. కలిదిండి మండలం పడమటిపాలెంలో మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన మైక్రో వాటర్ ఫిల్టర్‌ను ఆయన సోమవారం ప్రారంభించారు. గ్రామాల్లో మైక్రో వాటర్ ఫిల్టర్లు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, గ్రామ సర్పంచ్ సానా మీనా సరస్వతి, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, నాయకులు సానా వెంకట రామారావు, చిట్టూరి బాలకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగబాబు, గ్రామ సచివాలయ సహాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.



పడమటిపాలెంలో మైక్రో వాటర్ ఫిల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

చెరువుల తవ్వకం నిలిపివేయాలి

ముదినేపల్లిరూరల్: మండలంలోని దేవపూడిలో చెరువుల అక్రమ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. పచ్చని పంట భూములను కాపాడాలంటూ నినదించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కౌలురైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఉల్లంకి నాంచారయ్య, కార్యదర్శి చిన్నం మాధవరావు మాట్లాడుతూ గ్రామ ఆయకట్టు పరిధిలో 550 ఎకరాలు మాగాణి భూములు ఉండగా ఇప్పటి వరకు 150 ఎకరాల వరకు చెరువులు తవ్వేశారన్నారు. మిగిలిన భూములనూ చెరువులుగా మార్చేయడంతో పర్యావరణం నాశనం కావడంతో పాటు ఇతర నష్టాలు సంభవిస్తున్నాయని చెప్పారు. కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వీఆర్వోకు అందజేశారు. ధర్నాలో ఆలపాడు కుటుంబరావు, బోయిన కృష్ణమూర్తి, వీరంకి కృష్ణ, గూడవల్లి నాగముసలయ్య, పెద్ది శ్రీనివాసరావు, కోడూరు రామచంద్రరావు, మట్లపూడి కనకరావు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

దాత సహకారంతో బెంచీల వితరణ

జమిదింటకుర్రు(పెదపారుపూడి): పంచాయతీకి దాతలు చేస్తున్న సహకారం మరవలేదని వైఎస్సార్ సీపీ నేత, గ్రామ సర్పంచ్ పుణుకొల్లు శివరామప్రసాద్ అన్నారు. మండలంలో జమిదింటకుర్రు గ్రామానికి చెంది విజయవాడలో ఉంటున్న కొల్లి వెంకట అప్పారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు లక్ష్మీనారాయణ రూ.15 వేలు విలువ చేసే స్టీల్ బెంచీలను సోమవారం వితరణగా అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మీనారాయణను అభినందించారు.

30 లీటర్ల సారా స్వాధీనం

కైకలూరు: గ్రామాల్లో సారా విక్రేతలపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో(సెబ్) కైకలూరు సీఐ ఎస్.రాంబాబు హెచ్చరించారు. సెబ్ కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడుతూ.. కైకలూరు మండలం శృంగవరప్పాడు గ్రామానికి చెందిన బలే వెంకటేశ్వరరావు, కోటలంక గ్రామానికి చెందిన ఘంటసాల పెద్దిరాజులు ద్విచక్ర వాహనాలపై వెళ్తుండగా తనిఖీల్లో పట్టుబడ్డారన్నారు. వీరిద్దరి నుంచి 30 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని, వాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో ఓ మహిళ నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడిలో ఎస్‌ఐ జైనులాబ్దిన్, సిబ్బంది పాల్గొన్నారు.